# మూడు చక్రాల సైకిలు

"టెలిఫోన్ సార్!"

"ఉండుండు వస్తున్నాను-"

"హల్లో! ఎవరక్కడ? సుబ్బారావ్ స్పీకింగ్..."

"నేనండీ- మన బుజ్జిగాడు బుజ్జిగాడు-"

"బుజ్జిగాడు బుజ్జిగాడు అని ఏడుస్తావేం? తిన్నగా చెప్పు...నాకు కాళ్ళు అడ్డంలేదు."

"ఆసుపత్రినుంచి మీకు ఫోను చేస్తున్నాను. మన బుజ్జిగాడు యిందాక ఉప్మా తింటూ తింటూ తూలిపోయి పడిపోయాడండి. నోట్లోంచి నురగ మ్యునిసిపల్ డాక్టరుగారి దగ్గరకు తీసుకొచ్చాం- మన యింటివాళ్ళ చిన్నబ్బాయి సాయం తీసుకుని ఆసుపత్రికొచ్చాం. మీరు చప్పున రావాలి.

"అయితే వస్తున్నానుండు. నన్ను ఇంటికి తగులడమంటావా ఆసుపత్రికి చావమంటావా?"

"వుండండి. డాక్టరుగార్నడిగి చెప్తాను— ఆ...ఇంజక్షన్ యిచ్చారు. తీసకెళ్ళి యింటిదగ్గర పడుకోబెట్టమన్నారు. మాత్రలిచ్చారు- మీరు ఇంటికే రండి"

"ఏం ఖంగార్లేదు కదా-"

"ఏమోనండీ..."

"ఏడవకు...వస్తున్నా"

*　　　*　　　*

"ఒరేయ్ బుజ్జీ- బుజ్జీ చూడమ్మా చూడు! మాట్లాడమ్మ మాట్లాడు. ఇదిగో..."

"లేమ్మా బుజ్జీ— నాన్నగారొచ్చారు చూడమ్మా!"

"ఇంతకీ ఏమంటారు డాక్టరు. ఆ నురగేవిటి? ఎప్పుడు తెలివొస్తుంది?"

"ఏమోనండి. కళ్ళు తిరిగాయేమోనని నేననుకున్నాను. ముందు వెదవ అల్లరి చేస్తున్నాడేమో ఉప్మా కింద ఒలికిపోతోందని వీపుమీద రెండేశాను."

"వేశావా- అవును నీ చేయి మహావాడి."

"దిక్కుమాలినదాన్ని.. పిల్లాడు తెలివితప్పి యిలా మంచానికి అంటుకుపోతాడని నాకేవి తెలుసు?"

"తెలివి తప్పిన పిల్లాడిని యిలా యింట్లో పెట్టుకుని ఎంతసేపు కూర్చుంటాము. మరో చిల్డ్రన్ స్పెషలిస్టుకి చూపించాలి. పదపద బయల్దేరు-"

రిక్షాపిలవండి ఏడుకొండలవాడా! వెంకటేశ్వరస్వామీ

నీ దయవలన పిల్లాడికి తెలివొస్తే నీ కొండకొస్తాము. మా వారు జుట్టు యిచ్చేస్తారు. పిల్లాడికి కూడా జుట్టు తీయిస్తాము.

* * *

రిక్షాలో—

"పిల్లాడు చూడండి ఎల్లా జావకారిపోతున్నాడో! నేను మళ్ళీ నా చేత్తో అన్నం పెట్టుకుంటానా— నా చేతుల్తో బుజ్జిగాడికి నీళ్ళోసి లాగూ చొక్కా తొడుక్కుంటానా...మళ్ళీ నా పిల్లాడు నా కళ్ళముందు ఆడుకుంటాడా...నేనెంత పాపిష్టిదాన్నండీ. నా చేతులు విరగ...మైకం కమ్మి తూలిపోతున్న పిల్లాడిని చేతులారా కొట్టాను."

"ఏడవకు. ఏడవకు, పుట్టినరోజుకి బుజ్జిగాడు పొడుగు లాగూ కుట్టించమన్నాడా, యిప్పుడెందుకులే చంటి వెధవ కాళ్ళ కడ్డంపడితే కిందపడతాడు అని నిక్కరే కుట్టించాను. మళ్ళీ లేస్తాడా—పొడుగులాగు కుట్టిస్తే తొడుక్కుంటాడా—"

"చెప్పుల కోసం ఏడ్చాడండి. చీటికీ మాటికీ పారేసుకొస్తున్నాడు అని కొత్తచెప్పులు బీరువాలో అడుగున కాగితం పొట్లంచుట్టి దాచేశాను. ఏవండీ మళ్ళీ తొడుక్కుంటాడా— నేనెంత పాపిష్టిదాన్నండీ! ! వాడు మళ్ళీ లేచి తిరగకపోతే వాడి చెప్పులు నా కెందుకండీ ... వాడి చెప్పులు నేనేంచేసుకోను నాయనోయ్!"

"ఊరుకో....ఊరుకో... పెద్ద డాక్టరుగారు ఏడిస్తే

చిరాకుపడతారు. ఆసుపత్రిలో దుఃఖం వచ్చినా ఇంటిదగ్గరే ఏడవాలి. ఎక్కడ ఏడుపువస్తే అక్కడ ఏడిస్తే వూరుకోరు."

* * *

ఇంటి దగ్గర—

"బుజ్జీ! బుజ్జీ! కదుల్తున్నాడండోయ్. మూలుగుతున్నాడు. కళ్ళు తెరిస్తే బావుండును. కళ్ళు తెరుస్తాడా- తెరు బుజ్జీ తెరు."

"అలామీద వాలిపోకు గాలి తగలనియ్. నేను మేలుకొని చూస్తూ వుంటాగా నువ్ కాస్త అలా చాపమీద నడుం వాల్చకో..."

"డాక్టరు ఏమన్నారండీ. మన బాబుకేం ఫర్వాలేదన్నారా? బతుకుతాడన్నారా—"

"మంచంమీద పడుకో పెట్టదన్నారు. రాత్రి తెలివొస్తే తెలివిరాకుండా మాత్రల్లు వేయమన్నారు. పొద్దున్న మళ్ళీ తీసుకురమ్మన్నారు."

"ఏం చెప్పలేదా—"

"చంటిబిడ్డ గుణం అయివుంటుంది అంటారు. రేపు తెలివొచ్చాక గట్టిమందూ, మంచి టానిక్ యిస్తారట. ఫరవా లేదు తగ్గిపోతుందన్నారు."

"తగ్గిపోతుందన్నారు గదా-చల్లనిమాట చెప్పా డాక్టరు

గారు. ఆ వెంకటేశ్వరుడే ఆయన నోట్లో దూరి అల్లా చెప్పించాడు. డాక్టరుగారి నోట్లో పంచదార పొయ్య..."

"డాక్టరుగారికి ఫీజు చెల్లిస్తే చాలు నువ్వు. నోట్లో పంచదార పొయ్యక్కర్లేదు."

"దేవుడుకూడా అంతే- కొబ్బరికాయ కొడితే చాలు నమస్కారం పెట్టక్కర్లేదు. అన్నట్లుంది మీ వరస."

"అవును. అంతే-

"కళ్ళు పోతాయి. లెంపలేసుకోండి. అన్నట్లు రేపు మన బుజ్జిగాడికి తెలివొచ్చి మళ్ళీ లేచి తిరుగుతే- ఈ చెప్పులేవిటి, వాడు సరదా పడుతున్నాడు బూట్లు, సాక్సు పట్రావాలండీ."

"కాళ్ళు నొక్కేసి లేత పాదాలు ఎదగవని చూస్తున్నాను. కాని బూట్లు కొనలేక కాదు. చిన్న టెరిలిన్ పాంట్ స్లాక్ కుట్టిద్దామనుకొంటున్నాను. ఎంతవుతుంది."

"బుజ్జిగాడు మూడు చక్రాల సైకిలంటే మనసుపడుతున్నాడండీ. ఏడాదయి పోరుతున్నాను. మీరు తెచ్చారు కాదు. ఎప్పుడూ డబ్బు యిబ్బందులే....వీధిలోకి ఎవరి పిల్లలన్నా తొక్కుకురావటం భయం వాళ్ళ సైకిలు తనకిచ్చేమంటాడు. లేకపోతే ఏడుస్తూ వాళ్ళ వెంట పడతాడు."

"బాగుండే కాళ్ళుందవని కొనలేదుకాని డబ్బులేక కొనాలని లేం కొనలేదంటావా!"

"సైకిలు కొనండి. బంతీ బ్యాటూ కూడా వ్రటండి. బద్ధకిస్తే నే నొప్పుకోను."

"నాకుమాత్రం వుండదా? నువ్వింతగా చెప్పాలా— బుజ్జిగాడు మళ్ళీ లేచి తిరగాలేకానీ యివన్నీ ఎంతసేపు—వాడు కావాలంటే కొండమీంచి కోతిని తీసుకురానా?"

"కోతెందుకు లెండి—"

* * *

బుజ్జిగాడికి తగ్గిపోయిన కొన్నాళ్ళకి—

"ఎందుకే ఆ వెధవ అలా ఏడుస్తున్నాడు?"

"ఆ ఏవుంది మొన్న చెప్పులు పారేసుకొచ్చాడా యిప్పుడు మళ్ళీ బూట్లకోసం పేచీలు పెడుతున్నాడు."

"ఇక్కడేం పోగేసుకుని కూర్చోలేదు. పారేసిందల్లా కొనడానికి-"

"అబ్బ - ప్యాంట్ ప్యాంట్ అంటాడు. వేలెడు లేదు వెధవకి ప్యాంటెందుకు చెప్పండి. ఆ ప్యాంటు ఖరీదు పెడితే చక్కటి రెండు నిక్కర్లొస్తాయా—"

"షోకులు ఆడంబరాలు అలవాటు చేయకూడదు పిల్లలకి."

"నాన్నా! నాన్నా! నాకు మూడు చక్రాల సైకిలు కొనవూ-"

"మూడు చక్రాల సైకి లెందుకురా - బుద్ధిగా చదువుకుని పెద్దవాడివైతే నా సైకిలే తొక్కుకుందువు గాని, నాది ర్యాలీ సైకిలు. మీ తాత నాకు పెళ్ళికి కొనిచ్చింది."

"బుజ్జి - తప్పు! అలా చూసిందల్లా కావాలని పేచీలు పెట్టకూడదు. నీ పేరు చెప్పి యాభై రూపాయలు తగలేసి సైకిలు కొనడం అది వీధిలోని పిల్లలందరూ తొక్కి విరగకొట్టి మూడురోజుల్లో మూల పడెయ్యడం...చక్కా వీధిలోకిపోయి ఆడుకోవాలి గాని యింట్లో నా నెత్తిమీదెక్కి పిండి కొట్ట కూడదు."

"పోనీ బంతీ బ్యాటూ కొనమని చెప్పవే అమ్మా!"

"బుజ్జి ఎన్ని బంతులవలేదు - అన్నీ ఎవరో ఎత్తుకు పోవడమే కాని ఒక్కటైనా నీ దగ్గరుందా? బ్యాటు కొంటే వీధిలో పిల్లలు విరిచి ముక్కలు చేయడమే కదా - నీ దగ్గర కుదురూ కుమ్మా వుండేడి స్తేనా?"

*  *  *

వీధిలో పిల్లలు ఆడుకొంటున్నప్పుడు—

"ఒకేయ్ సత్తీ ఒకేయ్ సత్తీ నన్ను నీ సైకిలొక్క మాటు తొక్కనివ్వవూరా—"

"బుజ్జి నువ్వు కాస్సేపు తోశావంటే నిన్ను తొక్క నిస్తాను. తోస్తావా..."

"పొద్దుస్తల్లా తోశాను కదరా మజ్జాన్నం తొక్కనిస్తా నన్నావ్?"

"అంటే అన్నాను మళ్ళీ తొయ్-"

*　　　*　　　*

"చూడండి అత్తయ్యా మీ బుజ్జి నా బూడ్సులు తొడుక్కోని యివ్వటం లేదు."

"ఒరే బుజ్జి వాడి బూడ్సులు వాడికిచ్చేయ్. ఇదేం ఖర్మం రా-ఊళ్ళోవాళ్ళ చెప్పులన్నీ తెచ్చి ఇంట్లో పెడతావ్. వెధవా డొక్క చీరేస్తాను యిలాటిపన్లు చేశావంటే-"

"అమ్మా మరి నాకు బూడ్సులు కొనే-"

"నీ మొహానికి నా మొహానికీ బూడ్సులొకటే తక్కువ."

*　　　*　　　*

"చూడు జానకీ నూటయాభై చేశాడు ఆ డాక్టరు బిల్లు. ఈ డాక్టర్లు దేవుళ్ళ ప్రాణాలు తోడేస్తున్నారు."

"ఏమిటోనండీ-వాడి అల్లరి భరించలేకుండా వున్నాను. అన్నీ పేచీలే-సైకిలు తొక్కనివ్వలేదని మేనేజరు భీమారావు గారి మనవడ్ని చితగ కొట్టేశాడు. ఇలా కొంపమీదకు తగూలు తెస్తుంటే ఎలాగెలాగ - అలా నాల్రోజులు సుస్తీచేసి ఏం కదలకుండా మంచంమీద పడివున్నాడో అంతే - అప్పుడే నా ప్రాణం కాస్త హాయనిపించింది."

"ఇదిగో జానకీ - నువ్వు బుజ్జిగాడ్ని గారం చెయ్య కూడదు. డిసిప్లిన్‌లో పెట్టాలి. అల్లరీ పెంకితనం చేస్తే రెండు తగల్నివ్వాలి. అంతేకాని వూరుకోకూడదు."

"ఆ వూరుకుంటానేమిటి! వెధవపని చేసినప్పుడల్లా చుర్రున అంటిస్తూ వుంటాను. కాని లక్ష్యపెట్టడండీ దులిపేసుకుని తిరుగుతాడు."

"ఇంక వీడేం బాగుపడతాడూ - మొక్కై వంగనిది మానై వంగుతుందా?"

* * *

ఒకరోజు బుజ్జిగాడు సత్తిగాడి మూడుచక్రాల సైకిలు త్రోసి త్రోసి రోడ్డు చివరదాకా వెళ్ళాక అలసిపోయి విసిగిపోయి యిలా అన్నాడు-

"ఒరే సత్తీ మా నాన్నా అమ్మా మంచాళ్ళు కార్రా! మనకి జ్వరంవాస్తే మన్ని ముద్దెట్టుకుంటార్రా. మనకి అక్కర్లేనపుడు అన్నీ యిస్తాం అంటారు. మనం అడిగినపుడు ఏదీ యివ్వరు. మళ్ళీ జ్వరం తగ్గాక బళ్ళో కెళ్ళకపోతే కొడతారు. ఒరే సత్తీ, నాకు మళ్ళీ జ్వరంవాస్తే బాగుండున్రా నాకు మళ్ళీ జ్వరంవాస్తే బాగుండున్రా..." ★